# తెగిపోని బంధం

శ్రోవి రామమోహన శాస్త్రి

ఆంజనేయులు లాల్చీ పక్క జేబులోంచి ఓ కవరు తీసి కృష్ణమూర్తి చేతి కిస్తూ - "మీ మరదలు రాసిందిరా నాకు. అది చదువుకున్నాక గాని నీ సంసార పరిస్థి తేమిటో తెలిసింది కాదు. పది రోజుల కిందట వచ్చినప్పుడు పిల్లల్ని తీసుకుని కోడలు రెస్టుకోసం పుట్టింటికి వెళ్ళిం దని అబద్ధం చెప్పి నమ్మించావ్! మళ్ళీ అదే మాట ఇప్పుడూ చెప్పావు. ఎంతకాలం దాస్తావురా? అసలు ఇది నమస్యే కా దనుకున్నావా? లేకపోతే నాకు చెప్పే దేమిటనా?" అని ప్రశ్నించాడు కొంచెం కటువుగానే.

కృష్ణమూర్తికి మాటలు దొరకటం లేదు. తప్పు చేసినట్లు తల వంచుకుని కూచున్నాడు కొద్ది సేపు.

"నిజానికి పిల్లల సుఖ సంతోషాల కన్నా మేం కోరుకునే దేముంటుందిరా! కన్నవాళ్ళ దగ్గిరా దాపరికమేనా?" అన్నాడు ఆంజనేయులు ఆవేశంగా.


"అలా ఆవేశపడకండి నాన్నా! సుగుణకి నేను భర్తగా మాత్రమే తెలును. కాని మీ కలా కాదు. మీ చేతుల్లో పెరిగాను. అన్ని కోణాల్లో నా ఎదుగుదల, నా స్వభావం, నా సుగుణాలు, దుర్గుణాలు, బలహీనతలు అన్నీ మీకు తెలును. కొన్నాళ్ళు పోతే పరిస్థితులు వా టంతట అవే చక్కబడతా యన్న ఆశతో, మిమ్మల్ని బాధపెట్టడం ఇష్టం లేక ఊరుకున్నాను. అసలు భార్యా భర్తల మధ్య ఇలాంటి అగాధాలు ఏర్పడకూడదు. ఏర్పడ్డా యంటే అందుకు కారణం కేవలం అవగాహన లేకపోవటమే. ఈ లోపం మా ఇద్దరిలోనూ ఉండబట్టే ఈ సమస్య తలెత్తింది. కనుక పరిష్కరించుకునే బాధ్యత కూడా మా మీదే ఉంటుంది" అన్నాడు కృష్ణమూర్తి.

"అ దేం మాటరా? నేను కూడా పరాయివాణ్ణనే అనుకున్నావా?"

"కాదు. మీరు నాకు సంబంధించిన మనిషి. నా మనిషి."

"అంటే కోడలు అలా అనుకుంటున్న దంటావా? నువ్వు పొరబడ్డావేమో! ఆ పిల్ల నా కోడ లయ్యాక నేను మీ ఇద్దరికీ కావలసిన వాణ్ణేగా?"

"అది మన దృష్టిలో. సుగుణకి ఆ ఉద్దేశం లేదు నాన్నా! ఇప్పుడే కాదు. పెళ్ళయిన నాటి నుంచే లేదు. లే దని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. తెలుసుకున్న వెంటనే ఆమె అభిప్రాయాలకు అనుగుణంగా నా పద్ధతిని మార్చుకుందా మనుకున్నాను. కాని అప్పటికే జరగాల్సిన డామేజి జరిగిపోయింది."



పండక్కి మావాళ్ళు, మనిద్దర్నీ రమ్మన్నారండీ, వచ్చేప్పుడు అన్నిరకాల పండ్లు ఒకో కిలో చొప్పున పట్రమ్మన్నారు....!

ఆంజనేయులు కొన్ని క్షణాలు కొడుకునే పట్టి పట్టి చూస్తూ ఉండిపోయాడు. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని భరించలేకపోయాడు కృష్ణమూర్తి.

"కూర్చొనుండండి నాన్నా! నేను వెళ్ళి కాఫీ కలిపి తెస్తాను" అంటూ లేచి కిచెన్‌లోకి వెళ్ళాడు. పది నిముషాల్లో రెండు కాఫీ గ్లాసులతో వచ్చాడు. ఒకటి తండ్రి కిచ్చి ఎదురుగా కూర్చున్నాడు.

"కాఫీ కాస్త చేదుగా ఉన్నట్టుంది" అన్నాడు ఆంజనేయులు రెండు గుటకలు మింగి.

"షుగర్ తెమ్మంటారా?" అడిగాడు కృష్ణమూర్తి.

"వద్దులే! చేదు అలవాటు చేసుకోవటం మంచిదే! వెళ్ళిన ప్రతి చోటా నాకు నచ్చినట్టు తియ్యని కాఫీ దొరుకుతుం దని ఏముంది? జీవితంలాగే ఇదీను. కొన్ని చేదు నిజాలు ఇష్టం లేకపోయినా వినాలి. చేదు అనుభవాలు బాధగా ఉన్నా భరించాలి మరి. తప్పదురా!" అని ఆంజనేయులు కాఫీ తాగేసి గ్లాసు టీపాయ్ మీద ఉంచేశాడు.

"ఒళ్ళంతా చిట చిట లాడుతోందిరా! నే వెళ్ళి రెండు చెంబులు నీళ్ళు పోసు కొస్తాను. ఈలోగా మీ మరదలు ఏం రాసిందో చదువు" అంటూ సోఫాలో పక్కన పడేసిన సంచిలోంచి రెండు తువ్వాళ్ళు పైకి లాగి భుజా నేసుకుని పెరట్లోకి వెళ్ళిపోయాడు.

కృష్ణమూర్తి కవరులోంచి కాగితాలు పైకి లాగి చదువుకోసాగాడు.

"పూజ్యులైన ఆంజనేయులు మావయ్యగారికి స్వర్ణ అనేక నమస్కారాలతో కొన్ని నిజాలు మీ దృష్టికి తీసుకురావటానికే ప్రత్యేకంగా మీ కీ ఉత్తరం రాస్తున్నాను. కృష్ణమూర్తి అనే ఓ రాతి మనిషికి జన్మ నిచ్చి, పెంచి, పెద్ద చేసి మీ బాధ్యత నెరవేర్చుకున్నారు. అతన్ని సంఘం మీదికి వదిలేసి చేతులు దులుపుకున్నారు. మీ ఇంటిల్లిపాదికీ అండగా నిలబడీనందుకు అపారంగా తృప్తి అనుభవిస్తున్నారు. ఏ రకంగా నైతే నేం? ఎవరి శ్రమని దోచుకుంటే నేం? ఆర్థికంగా మీరంతా రోడ్డున పడకుండా ఉద్ధరిస్తున్నందుకు, శ్రీరామచంద్రుడిలా మీ ఆజ్ఞలు పాలిస్తున్నందుకూ పొంగిపోతున్నారు.

"కాని అతగాడిచేత మూడు ముళ్ళూ వేయించుకున్న కర్మానికి మా సుగుణక్క మాత్రం భయంకర నరకంలో మగ్గిపోయింది. అది చదువూ, సంధ్యా లేని అడివి మనిషి కాదు. సంపాదనా, చట్టుబండలూ లేకుండా మొగుడు పెట్టింది తిని, తీరిగ్గా కూర్చుని పిల్లలని కనటం లేదే! డిగ్రీ ఉంది. ఉద్యోగం చేస్తోంది. మీ కొడుకు ఎంత సంపాదిస్తున్నాడో, అంత సంపాదిస్తోంది. బిళ్ళ కుడుముల్లా తెచ్చి మొగుడి చేతుల్లో పోస్తోంది పల్లమాలిన పతిభక్తితో. అంతే కాదండీ! వంచిన నడుం ఎత్తకుండా ఇంటెడు చాకిరీ చేస్తూ, అతగాడి దిక్కుమాలిన కోరిక లన్నీ తీరుస్తూ, పిల్లల్ని సంరక్షిస్తూ సతమత మైపోతోంది. 'నేనూ సంపాదిస్తున్నాను గదా, మీ కున్న స్వాతంత్ర్యం నా కెందుకు ఉండకూడదు?' అని అడగటం నిషిద్ధం. ఒకవేళ అడిగితే పొగరుబోత్తనం, మొగుడి మీద అగౌరవం అవుతుంది. ఇద్దరి సంపాదనా అతగాడు పూర్తిగా తన సొంత సొమ్ములాగే తన వాళ్ళ బాగోగుల కోసం, వాళ్ళని ఉద్ధరించటం కోసం ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టొచ్చు. అ దేమని నిలదీస్తే మగాడూ, మొగుడూ కాబట్టి కొడతా డు.

"శారీరకంగా బలహీనురాలు గదాని కట్టుకున్న దానిమీద చెయ్యి చేసుకునేవాడు మొగుడే నంటారా? అసలు వా డేం మగాడు? మీ పెంపకంలో అతగాడికి ఒంటబట్టిన సంస్కారం ఇదేనంటారా? ఈ రకమైన సంస్కారం గల ఆ శాడిస్టుతో మా అక్క ఎన్నేళ్ళని కాపురం చేస్తుందో మీరే ఆలోచించండి. అందుకే అది పిల్లల్ని తీసుకుని వచ్చేసింది. ఆమె నిర్ణయం తప్పుగా తోచలేదు మాకు. వ్యక్తిత్వం కాపాడుకోవా లనే తపనే కనిపించింది. ఇదంతా కేవలం మా అక్క వెర్షన్ మాత్రమే విని రాయటం లేదు. ఆ మధ్య కొన్నాళ్ళు నే నక్కడ ఉన్నా నన్న విషయం మీ క్కూడా తెలును. అప్పుడే నేను కృష్ణమూర్తి విశ్వరూపం చూశాను కనుకనే ఇంత ధైర్యంగా రాస్తున్నాను. చాతనైతే మీ కొడుకుని దార్లో పెట్టుకోండి.

"ఇలా అంటున్నా నని, మే మేదో మా అక్క బతుకు బండలైపోకుండా కాపాడే రాయబారం నడపమంటున్నాం అనుకోకండి. పెళ్ళాన్ని వదిలేసిన మొగుడు మరో పెళ్ళాన్ని వెతుక్కుంటాడు. పెళ్ళాం కూడా ఇప్పటి రోజులను బట్టి తేలిగ్గానే దొరుకుతుంది. అంత దిక్కుమాలిన రోజు లివి. అసలు మా

అక్క మీ కీ ఉత్తరం రాయటానికి కూడా ఒప్పుకోలేదు. అయినా సరే, మీ వయస్సుని గౌరవించి రాస్తున్నాను. అంతే కాదు. అతనికి రాబోయే మరో పెళ్ళాం బతు క్కూడా మా అక్క బతుకులాగా కాలిపోకుండా అతన్ని మనిషిగా మార్చే ప్రయత్నం చేస్తా రనే ఆశతో రాస్తున్నాను. అంతే!

సెలవు

స్వర్ణ."

ఆంజనేయులు స్నానం ముగించుకుని మళ్ళీ అవే బట్టలు వేసుకుని వచ్చాడు. తువ్వాళ్ళు రెండూ ఫాను కింద కుర్చీ మీద ఆరేసి, సోఫాలో కూర్చున్నాడు.

"ఏరా కృష్ణా! స్వర్ణ రాసినట్లు అంత పశువులా ప్రవర్తించావా? నీలో ఆ రకమైన రాక్షసత్వం దాగి ఉన్నట్లు నే నెప్పుడూ గమనించలేదు. చాలా ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు.

"సహనానికి కూడా ఒక హద్దంటూ ఉంటుంది నాన్నా! మనసులో తగలరాని చోట దెబ్బ తగిలితే భరించటం ఎంత కష్టమో అనుభవించే వాడికే తెలుస్తుంది. మన కుటుంబం, ఆర్థిక పరిస్థితులూ సుగుణకి పూర్తిగా తెలును. నా బాధ్యతలూ, బరువులూ అన్నీ దాచుకోకుండా చెప్పాను. చెల్లె ళ్ళిద్దరి పెళ్ళిళ్ళ కోసం అవసరమైనప్పుడు వాడుకునేందుకు వీలుగా ఆమె జీతంలో నెల నెలా వెయ్యి పైన తన పేరు మీదే బాంకులో వేయించాను. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు రెండూ ఒకే ముహూర్తానికి చెయ్యాల్సి రావటంతో ముప్పై వేలు ఖర్చు పెట్టడం తప్పని సరైంది. అసలు తగూ అక్కడే ప్రారంభమైంది" అన్నాడు కృష్ణమూర్తి గతాన్ని నెమరువేసుకుంటూ.

"ఆమెకి ఇష్టం లేకుండా డబ్బు విత్ డ్రా చేయించావా?" అ నడిగాడు ఆంజనేయులు.

"ఇష్టం లేదని నే నా సమయంలో చేతులెత్తేస్తే పెళ్ళిళ్ళు ఎలా చేస్తాం చెప్పండి! మీ రేమో ఉన్న కొంపలో సగం వాటా అమ్మేస్తా నని కూర్చున్నారు. తరతరాల నాటి ఇల్లు. దాన్ని నిలబెట్టుకోవా లన్న తపన నాది. ఎలాగూ డబ్బు చేతులో ఉంది. అది ఖర్చుపెడితే ఇల్లు నిలబడుతుంది. ఆమాటే చెప్పాను. కాని సుగుణకి మాత్రం ఈ ఊళ్ళో ఇల్లు కొనాలన్న కోరిక. చివరికి డబ్బు డ్రా చేసి తెచ్చిం దనుకోండి. బహుశా లోకం నిందిస్తుం దన్న భయమో, భర్తగా నాకున్న అధికారాన్ని ప్రదర్శించి తమ శ్రమశక్తిని దోచుకుంటున్నా నన్న అనుమానమో ఉండే ఉండాలి. ఏది ఏమైనా అప్పటినుంచీ మా మధ్య ఓ సరిహద్దు ఏర్పడిపోయింది. సుమారు ఏణ్ణర్ధం అయిపోయింది" అన్నాడు కృష్ణమూర్తి బాధ దాచుకునే ప్రయత్నం చేస్తూ.

ఆంజనేయులికి కొడుకు సంసార పరిస్థితి ఏమిటో చాలావరకు అర్థమైపోయింది.

"స్వర్ణ రాసిన ఉత్తరం చదవగానే ఆ సంగతి నాకు తెలిసిపోయింది రా కృష్ణా! అందుకే బయలుదేరాను. అన్ని ఏర్పాట్లూ చేసుకునే వచ్చాను" అన్నాడు.

"అంటే?" అడిగాడు కృష్ణమూర్తి తెల్లబోతూ.

"మ రేం లేదురా! ఇంటి మీద మమకారం చంపుకుని సగభాగం అమ్మేశాను అరవై వేలకి. ఇరవై వేలదాకా అప్పులు తీర్చేశాను. మిగిలిన నలభై వేలూ డ్రాఫ్టు కట్టి తెచ్చాను. అది కోడలు చేతులో పెట్టేస్తే, డబ్బు సృష్టించిన ఈ సమస్య తీరిపోతుం దని నా నమ్మకం!"

"నేను అసమర్థుణ్ణని మీరూ నిర్ణయించుకున్నట్లేగా నాన్నా?" అనడిగాడు కృష్ణమూర్తి బేలగా.

"సు వ్వొట్టి పిచ్చి నన్నాసివిరా కృష్ణా! శక్తికి మించిన బాధ్యతలు నెత్తిన పడ్డ మధ్య తరగతి వాళ్ళు ఎప్పుడూ అసమర్థులేరా! లోకం సంగతి పక్కన పెట్టు. మన సమర్థత ఏమిటో మనకి తెలుసు. ఆత్మ వంచన వద్దు. వ్యక్తిగతంగా నీ మట్టుకు నువ్వు సుగుణ సంపాదనే అండ లేకపోతే ఆ శుభకార్యాలు చెయ్యగలిగేవాడివేనా? చెయ్యలేవు. ఇ దంతా ఆలోచించే ఆనాడు ఇల్లు తెగనమ్ముతా నంటే పడనివ్వలేదు నువ్వు. మరో పక్క ఇల్లు నిలబెట్టుకుందా మన్న కోరిక.

"కాని జరిగిం దేమిటి? ఇల్లు నిలబడిందేమో గాని, నీ సంసారం కూలిపోయే పరిస్థితి దాపరించింది. ఇప్పుడు చూస్తూ ఊరుకోవడం నా వల్ల కాదు. అందుకే తెగించాను. డబ్బు సుగుణ చేతిలో పెట్టేస్తే ఆమె తృప్తి పడుతుంది. ఈ విషయం చెప్పి, ఇటు నుంచి ఇటే రాజమండ్రీ వెడదా మనే



వచ్చాను. సమస్యకి పరిష్కారం ముఖ్యంగానీ సమర్థతలూ, అసమర్థతలూ బేరీజు వేసుకోవటం కాదు. మరి నేను బయలుదేరతాను. ఎంత త్వరగా పనైపోతే అంత త్వరగా వచ్చేస్తాను. అదృష్టం కలిసొస్తే కోడల్నీ పిల్లల్నీ తీసుకునే వస్తాను" అంటూ ఆంజనేయులు ఫాన్‌గాలికి సగం ఆరిన తువ్వాళ్ళు మడత పెట్టి చేతి సంచిలో కుక్కేసి లేచి నిలబడ్డాడు.

"పదండి! మిమ్మల్ని కాంప్లెక్స్‌లో దింపుతాను" అంటూ కృష్ణమూర్తి కూడా లేచాడు.

** ** **

డాబా మీద పిట్టగోడ నానుకుని నిలబడే ఏదో వీక్లీ పేజీలు తిప్పుతోంది స్వర్ణ.

మూడు రోజుల నాడు జరిగిన తన పెళ్ళి చూపుల సన్నివేశాలే గుర్తొస్తున్నాయి ఆమెకి.

పెళ్ళి కొడుకు హోదాలో వచ్చిన రాజేశ్వర్ తనతో పది నిముషాలు పర్సనల్‌గా మాట్లాడ్డానికి పర్మిషన్ అడిగాడు. పర్మిషన్ దొరగ్గానే ఇలాగే డాబా మీదికి వచ్చారు. ఎదు రెదురుగా కుర్చీల్లో కూర్చున్నారు.

"ఉద్యోగం చేసే పిల్లను చేసుకోవాలని నా ఉద్దేశం స్వర్ణగారూ! అందు క్కారణం నా మీ దున్న బాధ్యతలూ, అవసరాలూ. మీరు ఎం.కాం.

పొనయ్యారు. ఏ వేవో ఇంటర్వ్యూలకి వెళ్ళొచ్చా రని తెలిసింది. ఒకవేళ ఉద్యోగం వస్తే చెయ్యటానికి మీకు అభ్యంతరం లేదు గదా? ఎందుకంటే నా భార్య సంపాదన నాకు అవసరం" అన్నా డతను.

"మీ అవసరాలు దృష్టిలో ఉంచుకునే మీరు పెళ్ళి చేసుకుంటారు. అంతేగాని అమ్మాయి రూపం, చదువూ నచ్చి కాదన్నమాటేగా?" అడిగింది తను.

"అవన్నీ నచ్చాయి కనుకనే ఈ విషయం మీతో డిస్కస్ చేస్తున్నాను. అదృష్టం కలిసొచ్చి మనం పెళ్ళి చేసుకుంటే, మీరు ఉద్యోగస్తురాలైతే మీ సంపాదన కొన్నేళ్ళపాటు నా బాధ్యతలు నెరవేర్చుకోడానికి ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. భార్య సంపాదన లేకపోతే బాధ్యతలు నెరవేర్చుకోలేని దరిద్రుడివా నువ్వు - అని మీ రడగచ్చు. ఆ మాట ఒప్పుకోను గాని, మధ్య తరగతివాణ్ణని అంగీకరిస్తాను. అందుకే బాంధవ్యాలకి బందీ అయిపోయాను. 'ఏ ధైర్యంతో నా సంపాదనని నీ సొంతంలా ఖర్చుపెడదా మనుకున్నావ్?' అన్న ప్రశ్నొస్తుం దేమో మీ నుంచి. నాకు భార్యగా వచ్చిన స్త్రీ నా జీవితంలోనే కాదు, నా కుటుంబంలో ఓ భాగం అవుతుం దన్నది సత్యం.

"ఇది తరతరాలుగా సాగుతున్నదే! ఈ రకం ఒప్పందా ల్లాంటివి గత కాలంలో లేకపోవచ్చు. ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక వ్యవస్థలో ఇది తప్పనిసరి అవుతోంది. నా ఆలోచనలు మీకు నచ్చకపోయినా, మీకు అభ్యంతరా లున్నా లేదూ, నా కున్న కమిట్‌మెంట్స్ లాంటివి మీ కేవైనా ఉన్నా దాపరికం లేకుండా చెప్పండి. వాటి స్థాయిని బట్టి, తీవ్రతని బట్టి పరస్పరం ఓ అండర్‌స్టాండింగ్‌కి వద్దాం. తొందర లేదు. బాగా ఆలోచించుకునే నాకు తెలియజెయ్యండి. అదీ నేను మీకు నచ్చితేనే లెండి. నెల కాకపోతే, రెండు నెలలు టైం తీసుకోండి. మీ నుంచి కబురు వచ్చేదాకా నేను వెయిట్ చేస్తాను" అంటూ కుర్చీలోంచి లేచాడు రాజేశ్వర్. అతను మెట్లదాకా వెళ్ళి క్షణం ఆగాడు.

ప్రశ్నార్థకంగా చూసింది తను.

"స్వర్ణగారూ! పెళ్ళి చూపుల కొచ్చినప్పుడే ఈ విషయాలన్నీ మాట్లాడ్డం దేనికని మీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు. పెళ్ళయి సంసారంలో పడ్డాక డబ్బు వ్యవహారాలతో కలతలు మొదలై ఆనందాన్నీ అనుభూతులనీ, మాధుర్యాన్నీ దూరం చేసి, బతుకును దుర్భరం చేస్తున్నప్పుడు బాధపడటం కన్నా ముందే ఓ అవగాహనకి రావటం మంచిదనే భావంతో మీకు చెప్పాను. ఆపైన మీ ఇష్టం. సెలవు" అంటూ మెట్లు దిగసాగా డతను. తను మౌనంగా అనుసరించింది.

సగం మెట్లు దిగాక అతన్ని ఆపి - "రాజేశ్వర్‌గారూ! పెళ్ళికి ముందు ఉద్యోగం రాలే దనుకుందాం! పెళ్ళయ్యాక నాకు ఉద్యోగం వేయించుకోడానికి ప్రయత్నిస్తారా?" అ నడిగింది తను.

సన్నగా నవ్వా డతను. "ఒక్క ప్రశ్నే అడిగా రేం? మీ మనసులో రెండోది కూడా ఉండే ఉంటుంది. ఎలాగూ మూణ్ణెల్లదాకా ముహూర్తాలు లేవు, ఈ లోగా ఉద్యోగం రాకపోతే ఇంతే సంగతులా' అని అవునా? మీరు నాకు నచ్చారు అన్ని విధాలా. మిమ్మల్ని కా దనే ప్రసక్తి లేదు. మీ రన్నట్టు పెళ్ళిలోగా రాకపోతే తరువాత నేను ప్రయత్నిస్తాను. తప్పనిసరి. నా నెసెసిటీ!" అన్నాడు.

రాజేశ్వర్ వెళ్ళిపోయినా, అతని మాటలు తనలో చాలా సంచలనం సృష్టించాయి. అదే పనిగా గుర్తొస్తున్నాయి. రూపంలో అతను గొప్ప అందగాడు కాడు. సాదా సీదా మనిషి. చూసీ చూడగానే చూపు నిలబెట్టే ఆకర్షణ లేదు. కాని అతని మాటల్లో ఏదో శక్తి ఉంది. బహుశా వాస్తవ దృష్టి అయి ఉంటుంది. సామాజిక ఆర్థిక పరిస్థితులకి జీవిత విధానాన్ని మలచుకునే తపన కావచ్చు.

మరి సుగుణక్కా, కృష్ణమూర్తీ పెళ్ళికి ముందు ఈ రకమైన అంగీకారానికి రాలేదా? తన బరువు బాధ్యతల గురించి కృష్ణమూర్తి సుగుణక్కకి వివరించి, ఆమె సహకారం కోరి ఉండకపోతే అది అతని తప్పే. అతని వల్ల ఆ తప్పే జరిగి ఉంటే పెళ్ళయ్యాక భర్తగా తన అధికారాన్నీ ఆధిక్యాన్నీ ప్రశ్నించే ధైర్యం ఆమెకు ఉండకూడ దన్న అహంకారం అందుకు కారణం కావాలి. ఒకవేళ చెప్పే ఉంటే మొదట్లో ఒప్పుకున్న సుగుణక్క తరువాతి కాలంలో అప్పటి ఆర్థిక ఒత్తిడులకు ఎడ్జస్ట్ కాలేక ప్రతిఘటించి ఉండొచ్చు. మొత్తం మీద ప్రస్తుతం వాళ్ళ సంసార దుస్థితికి ఇద్దరి బాధ్యతా ఉండి తీరాలి.

ఈ ఆలోచన రాగానే స్వర్ణ మొట్టమొదటిసారిగా, జరిగిన పరిణామాలకి కృష్ణమూర్తినే దోషిని చేసి, తీవ్రంగా దూషిస్తూ ఆంజనేయులుగారికి లెటర్ రాసినందుకు లోలోపల చాలా బాధపడింది. పాపం, పెద్దాయన ఎంత బాధపడ్డాడో లోపల!

నలభై వేల రూపాయల డ్రాఫ్టుతో ఆయన వచ్చిన నాటి దృశ్యం ఆమె మనోనేత్రం ముందు కదిలింది. భారంగా నిట్టూర్చింది.

చుట్టూ మసక చీకట్లు ముసురుకుంటున్నాయి. చదవకపోయినా, చూస్తున్న వీక్లీలోని అక్షరాలు మసకబారుతున్నాయి.

'సుందరం అంకుల్ ఇంటికి వెళ్ళిన అమ్మా, సుగుణక్కా ఏ వేళకి వస్తారో తెలియదు. ఆఫీసు నుంచి డాడీ వచ్చే వేళైంది' అనుకుంటూ డాబా నుంచి కింది హాల్లోకి వెళ్ళింది స్వర్ణ.

"బాబుగా రొచ్చేశారమ్మా!" అన్నది హాలు ఊడుస్తున్న పనిమనిషి.

"ఎంతసేపైంది?" అడిగింది స్వర్ణ.

"పది నిముషా లైందమ్మా! బట్టలు మార్చుకుని గదిలో కూర్చున్నారు. మీరు కింది కొస్తే కాఫీ తెమ్మని చెప్పమన్నారు."

స్వర్ణ వీక్లీని సోఫాలో పడేసి కిచెన్‌లోకి నడిచింది. రెండు కప్పులతో కాఫీ తీసుకుని కుటుంబరావు గదిలోకి వెళ్ళింది.

"రా బేబీ! సుందరం అంకుల్ ఇంటికి వెళ్ళ లేదేం?" అడిగాడు కుటుంబరావు స్వర్ణ చేతుల్లోంచి ఓ కప్పు అందుకుంటూ.

"నే నెందుకు డాడీ?" అన్నది స్వర్ణ ఆయనకి ఎదురుగా ఉన్న ఓ కుర్చీలో కూర్చుంటూ.

"సరే గాని, రాజేశ్వర్ విషయంలో నీ అభిప్రాయం చెప్పలే దేం?" అడిగా డాయన కాఫీ ఒక్కొక్క గుక్క చప్పరిస్తూ.


"ఇంకా ఏమీ అనుకోలేదు డాడీ!"

"ఇట్సాల్ రైట్. కాస్త తొందరగా చెబితే బావుంటుం దేమో. కుర్రాడు పెద్ద అందగాడు కాకపోయినా బుద్ధిమంతుడు. చాలా ప్రాక్టికల్ మైండ్. వెరీ ఓపెన్!"

ఖాళీ కప్పు కింద పెట్టాడు కుటుంబరావు. ఓ సిగరెట్ ముట్టించి గట్టిగా రెండు దమ్ము ల్లాగి గాల్లోకి వదిలాడు.

"అయినా నా పెళ్ళి కిప్పుడు తొంద రేమొచ్చింది? ముందు అక్క సంసారం చక్కబడనివ్వండి!" అన్నది స్వర్ణ.

"నీ కింకా ఆశ ఉన్నట్టుంది! నౌ ఇ టీజ్ ఎట్ ద బ్రేకింగ్ పాయింట్. సుగుణే కాదమ్మా! మీ మమ్మీ కూడా పూర్తిగా తెగతెంపులు చేసుకోవా లన్న ఉద్దేశంలో ఉంది. నిప్పులో నెయ్యి పోస్తోంది. అందులో భాగమే సుందరం అంకుల్ దగ్గరకి వెళ్ళడం. ఆయన గారి హోదా తెలుసుగా నీకు? ఎం.పి. ఆయన తల్చుకుంటే సుగుణక్కకి అక్కణ్ణుంచి ఈ ఊరు ట్రాన్స్‌ఫ రవటం చాలా తేలిక. భౌతికంగా కూడా దూరం పెరిగిపోతుం దమ్మా!" అన్నాడు



కుటుంబరావు దిళ్ళకి జార్లాపడి పైన తిరుగుతున్న ఫాన్ వైపు చూస్తూ.

"డాడీ! ఇంత జరుగుతున్నా మీరు మౌనంగా ఉండిపోయారు. అక్క నిర్ణయాన్ని ఆమోదిస్తున్నారా?"

"మౌనంగా ఉన్నంత మాత్రాన అర్థం అదేనా? అయినా ఎలా ఆమోదిస్తాను బేబీ? ఆమోదించటానికీ, అభినందించటానికీ ఇ దేమైనా సమస్త స్త్రీ లోకాన్నీ ఉద్ధరించటానికి సుగుణ లేవదీసిన మహోన్నతమైన విప్లవోద్యమం అంటావా? భవిష్యత్తు పట్ల దూరాలోచన, వివాహబంధం అంటే సరైన అవగాహన, ఒక మగవాడి జీవితంలో భాగం అయ్యాక వచ్చి పడే కొత్త కొత్త బాధ్యతల్ని కర్తవ్యంగా స్వీకరించే హృదయ వైశాల్యం లేని తొందరపాటు చర్య అనే నే ననుకున్నాను."

"ఇంత తెలిసీ మరి మీరు మమ్మీనీ, సుగుణక్కనీ ఎందుకు వారించలేదు డాడీ?"

"ఇ టీజ్ ఎ థౌజండ్ డాలర్ క్వశ్చన్ బేబీ? హృదయాన్ని మథించే ప్రశ్న. పాల సముద్రాన్ని మథిస్తే అమృతం, హాలాహలం రెండూ పుట్టా యంటారు. కానీ నా హృదయంలో అమృతంలాంటి అనుభూతు ల్లేవు బేబీ! నా స్వేచ్ఛనీ, స్వాతంత్ర్యాన్నీ వ్యక్తిత్వాన్నీ చంపేసి, కేవలం బానిసత్వాన్ని ప్రసాదించిన హాలాహలం ఉంది. అంతే! ఎందు కిలా అయిపోయా న్నేను అని నన్ను నేను ప్రశ్నించుకున్నప్పుడు, నా ముఖం నాకే పగిలిన అద్దంలో ప్రతిబింబంలా వికృతంగా కనిపిస్తూ ఉంటుంది. కొందరి జీవితాల్లో అలా రాసిపెట్టి ఉంటుంది. అఫ్‌కోర్స్ ది సీజ్ ఎస్కేపిజమ్. ఒప్పుకుంటాను. అయినా అలా అనుకోకపోతే మనిషి బతకలేడు. కోరుకున్న దేదీ లభించకపోగా, ఆశించనివి దొరకటం జీవితంలో అన్నింటికన్న పెద్ద ఐరనీ!" అని ఆగాడు కుటుంబరావు. ఆయన గొంతు వణుకుతోంది. ఉన్నట్టుండి స్మృతుల ప్రపంచంలోకి వెళ్ళిపోయా డాయన.

తండ్రిని ఎప్పుడూ అలాంటి స్థితిలో చూచి ఎరగని స్వర్ణ, ఏదో అర్థంగాని మహా కావ్యం చదువుతున్నట్లు కుటుంబరావు ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది. ఆయనలో ప్రతిబింబిస్తున్న వేదన ఆమెని కదిలించేస్తోంది.

"ప్రేమించటం అంటే కేవలం శారీరక ఆకర్షణ కాదు బేబీ! మానసికంగా ఆకర్షణ, ఐక్యత కావాలి. ప్రేమికు లిద్దరిలో ఏ ఒక్కరి గౌరవాగౌరవాలకైనా, సంతోష విషాదాలకైనా రెండో వ్యక్తి స్పందించగలిగినప్పుడే ఆ తాదాత్మ్యం ఉన్నట్లు! ఇది చాలా సున్నితమైన విషయం బేబీ! మెటీరియలిస్టిక్‌గా ఆలోచించేవాళ్ళు దీని ఇంపార్టెన్స్ గ్రహించలేరు. వేదాంతం చెపుతున్నానా?" అన్నా డాయన.

"లేదు డాడీ! నాకు కనిపించని జీవిత సత్యం చెపుతున్నట్లనిపిస్తోంది" అన్నది స్వర్ణ.

కుటుంబరావు హృదయంలో మారుమూల చీకటి పొరల అట్టడుగున దాగిన కొన్ని భయంకర అనుభవాలు ఒక్కసారిగా పెల్లుబికి వచ్చేస్తున్నాయి. 'సంయమనం, సంయమనం' అంటూ వివేకం వెన్ను మీద చరుస్తోంది.

ఎదురుగా కూర్చున్న దెవరో కాదు. తనకీ, తన భార్య లలితకీ కన్నకూతురు. లలితకి వ్యతిరేకంగా తను ఏం చెప్పినా, కన్న తల్లి పట్ల దురభిప్రాయం ఏర్పడటానికి అవకాశం ఇచ్చినట్లవుతుంది. అంతే కాదు, తల్లి మీద లేనిపోని నిందలు వేస్తున్నందుకు త నంటే ఉన్న గౌరవం పోవచ్చు కూడా. తొందరపడితే లేని సమస్యలు కొని తెచ్చుకున్నట్లే అవుతుంది.

తండ్రి మౌనానికి కారణాలు ఊహించలేనంత అమాయకురాలు కాదు స్వర్ణ. ఊహలొచ్చిన నాటి నుంచీ నేటి వరకూ తల్లినీ, తండ్రినీ చూస్తూనే ఉంది. వారిలో భార్యాభర్తల మధ్య ఉండాల్సిన సహజమైన ప్రేమానురాగాలు కొరవడ్డా యని ఏనాడో గ్రహించింది. తండ్రి తక్కువ కులం వాడు కావటం తల్లి కాయన పట్ల చులకనకి కారణం అనుకుంటూ వచ్చింది. ఇంట్లో తల్లి మాట, అధికారం వేదవాక్కులా చెల్లుబాటు కావడం, ఆవిడ ఏమన్నా ఏం చేసినా తండ్రి ఏమీ మాట్లాడకపోవటం, అవకాశం దొరికినప్పుడల్లా తల్లి ఆయ న్నొక పురుగులా చీదరించటం గమనించింది కూడా. ఇదమిత్థంగా తెలియకపోయిన ఏదో ఓ కారణం ఉండి ఉండా లనే అనుకుంది. అ దేమిటో, సందర్భం వచ్చినా ఆయన చెప్పలేడనీ గ్రహించింది. అనవసరంగా, అన్నీ తెలిసి, ఆయన్ని బాధపెట్టే ప్రశ్న వేసినందుకు నొచ్చుకుంది.

"మీ తాతగారు నా అనాథ బతుకునీ, నా కులాన్నీ అసహ్యించుకునేవారు బేబీ! మీ మమ్మీ నాలో తనకి కనిపించిన అందాన్నీ నా ఇంటెలిజెన్స్‌నీ, నా డాషింగ్ నేచర్‌నీ కాలేజీ రోజుల్లో చాలా ఇష్టపడింది. పరిచయం పెంచుకుంది. ఎన్నో విధాలుగా నాకు నచ్చచెప్పి పెళ్ళికి ఒప్పించింది. మీ తాతయ్య ససేమిరా వీ ల్లే దనటంతో రిజిస్టర్ పెళ్ళి చేసుకున్నాం. ఆయన మొండితనంతో బంధం తెంపేసుకున్నాడు. ఆరేళ్ళపాటు మా ముఖం కూడా చూడలేదు. పోయే ముందు మాత్రం కబురు చేసి, మగపిల్లలతో సమానంగా నాలుగో వాటా ఆస్తిని మీ మమ్మీకి రాశారు. ఆ ఆస్తే నమ్మా మమ్మీకీ, నాకూ మధ్య అగాధం సృష్టించింది! స్త్రీకి పుట్టింటి పట్ల మమకారం ఉంటుంది. కా దనను. అది హృదయానికి సంబంధించింది. ఆస్తిపాస్తులకి సంబంధించింది కాదు. అందుకే ఆ ఆస్తిని తీసుకోడానికి నే నెంత మాత్రం ఒప్పుకోలేదు బేబీ! నా జీవితంలో మీ మమ్మీతో మొదటిసారీ, చివరిసారీ ఘర్షణ పడిన సన్నివేశం అదే నమ్మా. చివరికి నేనే నెగ్గి, నా ఆత్మ గౌరవం కాపాడుకున్నాను. మమ్మీ నా మీద కసితో, ద్వేషంతో ఆస్తంతా తెగనమ్మి ఓ అనాథ శరణాలయానికి విరాళంగా ఇచ్చేసింది. ఆ నాటి నుంచి నే నీ మౌనాన్ని ఆశ్రయించుకున్నాను. ఎవరూ నన్ను ఖాతరు చెయ్యరు. న న్నొక మనిషిగా గుర్తించరు. అలాంటప్పుడు నే నెవరిని ఒప్పించగలను?" అన్నాడు కుటుంబరావు.


వేళ్ళ మధ్య చివరంటా కాలిపోయిన సిగరెట్టు పీకని దూరంగా విసిరేసి మరోటి ముట్టించాడు. గుండెనిండా పొగ పీల్చి గుప్పున గాలిలోకి వదిలాడు.

"మీ కున్న సహనం బావ కిఎందుకు లేదు డాడీ? అక్క దురుసుగా మాట్లాడినందుకు, దాన్ని కొట్టడం రెండు మూడు సార్లు ప్రత్యక్షంగా చూశాను" అడిగింది స్వర్ణ అమాయకంగా.

క్షణకాలం ఊరుకుని - "అవసరాలు, సమస్యలూ మనిషిని సుడిగుండంలోకి తోసి ఉక్కిరి బిక్కిరి చేస్తాయి బేబీ? ఒడ్డు నుండి గడ్డలు వేస్తే ఆ మనిషి కెలా ఉంటుందో చెప్పు. ఆ పరిస్థితుల్లో అతనికి కావలసింది చేయూత నిచ్చి ఒడ్డుకు లాగడం, మానసికంగా ధైర్యా న్నివ్వడం. అంతేగాని కుళ్ళబొడవటం కాదు. అలా చేసినప్పుడే ప్రేమ అడుగున దాగిన పౌరుషం రెచ్చిపోతుంది" అన్నాడు గంభీరంగా కుటుంబరావు.

"మీ పౌరుషం అలా ఎప్పుడైనా రెచ్చిపోయిందా డాడీ?"

"లే దమ్మా! నేనే దాన్ని నిద్రపుచ్చాను కావాలని. నాకు తెలుసు నే నో వీక్లింగ్ నని. కారణం నా చదువు, నా ఉద్యోగం కానే కాదు బేబీ. నా పుట్టుక, నా కులం. మీ మమ్మీ నన్ను పెళ్ళాడ్డం ద్వారా నా కేదో ఔన్నత్యం కలిగిం దన్న కృతజ్ఞత. నా కోసం అన్నీ వదులుకుని వచ్చేసిం దన్న ప్రేమ - ఇవన్నీ కలిసి నన్ను బలహీనుణ్ణి చేశాయి. భరిస్తూనే ఆమె అభిమానం పొందా లని నా ఆలోచన. అది పొరపా టని తెలుసుకోవటానికి చాలా కాలం పట్టింది. అప్పటికి పరిస్థితు లన్నీ నాకు వ్యతిరేకంగా మారిపోయినాయి. రాజీ పడ్డాను. ప్రేమాభిమానాలు పోగొట్టుకున్నాను గాని మనుమల్ని కాదుగా!"



"బావ విషయంలో అలా ఎందుకు జరగలే దంటారు?"

"నాకు బాధ్యతలు లేవమ్మా! కాని కృష్ణమూర్తికి అలా కాదు. అతని తల మీద మొయ్యలేని బరువు లున్నాయి. వాటిని దించుకోడానికి నిత్య సంఘర్షణ, పోరాటం సాగిస్తున్నాడు. మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సంపాదించే భార్య సహకారం కావలసింది అక్కడే బేబీ! సుగుణ సహకరించింది. కా దనను. కాని బాధ్యతగా భావించే, అతన్ని అర్థం చేసుకునే కాదు. మాట పడిపోతా నన్న భయం వల్ల. క్రమంగా అది కృష్ణమూర్తి అంటే ద్వేషంగా మారింది. మంచి చెడ్డల విచక్షణ పోయింది. అనుక్షణం అతనికి మనశ్శాంతి లేకుండా చేసింది. నోటికొచ్చినట్లల్లా మాట్లాడింది. తట్టుకోలేక, ఏం చేయాలో తోచని అయోమయావస్థలో దౌర్జన్యం చేశాడు. సమస్య పరిష్కార మవుతుందని కాదు బేబీ! తన అసమర్థతని మరోరకంగా బయట పెట్టలేక. కట్టుకున్న భార్యని కన్విన్స్ చేయలేక. నీకూ తెలును గదమ్మా, పిల్లల్ని తీసుకుని సుగుణ వచ్చేసిన తర్వాత కృష్ణమూర్తి ఎన్నిసార్లు వచ్చాడో! తిరిగి రమ్మని ఎంతగా ప్రాధేయపడ్డాడో! మీ రంతా అతన్ని త లో వక్క నుంచి పొడి పొడిచి, మనసుకి తూట్లు చేసి పంపించారు. అయినా అతను ఊరుకోలేదు. ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. ఆఖరికి ఆ ముసలాయన ఆంజనేయులుగారు ఇంట్లో నగం వాటా అమ్మేసి, నలభై వేలు డ్రాఫ్టు కట్టి తెచ్చాడు. ఏం జరిగింది? అనరాని మాట లని వెళ్ళగొట్టారు. ఆయన వయస్సుని కూడా గౌరవించలేకపోయారు మీలో ఏ ఒక్కరూ. మీలో ప్రతి ఒక్కరిలో అహంకారమే తప్ప మానవత్వం ఏ కోశానా లే దేమో బేబీ!" కుటుంబరావు గొంతులో కాఠిన్యం తొంగి చూసింది.

స్వర్ణ నిర్ఘాంతపోయింది. డాడీలో అంత ఆవేదన గూడుకట్టుకున్నట్లు ఇప్పటి దాకా గ్రహించలేకపోయినందుకు క్రుంగిపోయింది. "క్షమించండి డాడీ!" అన్నది గాద్గదికంగా.

"ఇప్పుడు కావలసింది క్షమించుకోడాలు కాదు బేబీ! సుగుణ సంసారం పూర్తిగా విచ్ఛిన్నం కాకుండా చూడటం ఒక్కటే! చేతనైతే దానిలో మార్పు తేవటానికి ప్రయత్నించు. సంసారాలు కూల్చటం తేలికే. కాని సరి చేయటం చాలా కష్టం. ఆ పసివాళ్ళని చూడు. కృష్ణమూర్తి మీది ద్వేష మంతా పిల్లల మీద చూపిస్తోంది సుగుణ. పశువుల్ని కూడా మనుమ లన్న వాళ్ళు అలా హింసించరు. అడుగుల చప్పుడు వింటే చాలు భయంతో ఏ మూలనో దాక్కుంటున్నా రమ్మా. ఆ బుగ్గల మీద కన్నీటి చారికలు తప్ప, పెదవుల మీద చిరునవ్వులు చూసి ఎన్నో యుగా లైపోయినట్లున్న దమ్మా నాకు. శరణాలయాల్లో అనాథ శిశువులుగా ఉన్నా అక్కడ ఆయాలు ఏదో వేళప్పుడు ప్రేమగా దగ్గరకి తీసుకుంటా రేమో! సుగుణ కన్న తల్లిగా కనిపించటం లేదు. కటిక పాషాణంలా కనిపిస్తోంది. కాని నే నేం చెయ్యను చెప్పు! ఏమీ చేయలేను" అంటున్న కుటుంబరావు కళ్ళల్లోంచి అశ్రువులు జారుతున్నాయి.

స్వర్ణదీ అదే పరిస్థితి.

"బేబీ! చాలా అధికంగా మాట్లాడేశాను. మనసులో ఉంచుకో కమ్మా. అసలు నే నేమీ మాట్లాడ లే దనుకుంటే మరీ మంచిది. నా మనశ్శాంతికి భంగం ఉండదు" అన్నాడు కుటుంబరావు.

దారుణం! ఇలాంటి మానసిక సంక్షోభం ఎవరికీ ఉండకూడదు. స్వర్ణ మనసులో తండ్రి పట్ల ఒక్కసారిగా అంతు లేని జాలి కలిగింది. కళ్ళు తుడుచుకుంది.

"బేబీ! మరో కప్పు కాఫీ తీసుకు రామ్మా! ఎందుకో మరోసారి తాగా లనిపిస్తోంది" అన్నాడు కుటుంబరావు.

ఆయనకి కాఫీ తెచ్చి ఇచ్చింది.


** ** **

సిగరెట్టు పొగ వదులుతూ "చెప్పు స్వర్ణా! ఏవిఁటి ఇలా వచ్చేశావ్ హఠాత్తుగా? ఏదన్నా ఉద్యోగం వచ్చిందా? సుగుణా, పిల్లలూ కులాసాయేనా? గత నెల్లో మా పెద్ద పిల్ల 'ప్రేమ' పుట్టిన రోజుకి అందేలా పంపిన బట్టలు సరిపోయాయా? నన్ను తల్చుకుందా? ఇంకా అయిదో ఏడే కదా! అంత ఆలోచన ఉండదు. పైగా కొత్త బట్టల మోజులో పడిపోయి ఉంటుంది. రవికి బాగా మాట లొస్తున్నాయా?" అంటూ ఆగకుండా ప్రశ్నల వర్షం కురిపించాడు కృష్ణమూర్తి.

స్వర్ణ కళ్ళార్పకుండా అతన్ని చూస్తూ ఉండిపోయింది చాలా సేపు.

"సుగుణ రోజూ ఆఫీసుకి వెడుతోందా? ట్రాన్స్‌ఫర్ అయి మూ ణ్ణెల్లు దాటిం దనుకుంటాను. ఆ వాతావరణానికి అలవాటు పడిపోయి ఉంటుంది. అయినా సొంత ఊరు గదా! కొత్త అంటూ ఉండదు. మీ వాళ్ళంతా బావున్నారా? అన్నట్టు రాజేశ్వర్ సంగ తేం చేశావ్? ఆ మధ్యన ఓ నెల కిందట అనుకుంటాను మీ డాడీ ఏదో పని మీద వచ్చినప్పుడు కలిసి చెప్పారు. అతగా డింకా నీ గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నా డని. నచ్చలేదా నీకు?" మళ్ళీ కుప్పించా డతనే.

'బావా! ఒక్క ప్రశ్నకైనా సమాధానం చెప్పనిస్తావా, నువ్వే అడుగుతూ ఉంటావా? ఇలా అయితే మరి కాస్సేపటికి అసలు ఏం అడిగావో



మరిచిపోయే స్టేజి వచ్చేస్తుంది. తీర్వాత నీ ఇష్టం!" అన్నది స్వర్ణ.

కృష్ణమూర్తి నిర్జీవంగా నవ్వాడు.

"నీ ప్రశ్నలన్నింటికీ ఒకటే సమాధానం! అంతా కులాసా! అందరూ ఎవరి రొటీన్‌లో వా ళ్ళున్నారు - ప్రేమా, రవీ తప్పించి" అన్నది స్వర్ణ ఎటో చూస్తూ.

"అవును. వా ళ్ళెలా ఉన్నారో, ఎలా ఉంటారో నేను ఊహించగలన్లే స్వర్ణా! వాళ్ళు నా పిల్లలు గదా! అంచేత నా పోలికలే వచ్చి ఉంటాయి. కాకపోతే చిన్న తేడా - నేను మానసికంగా బాధపడుతున్నాను. వాళ్ళు శారీకంగా హింస అనుభవిస్తూ ఉండి ఉంటారు. మాకు పట్టిన దుర్దశ పగవాళ్ళ క్కూడా రాకూడదు స్వర్ణా! డెత్ ఈజ్ మోర్ హేపీయర్ దేన్ దిస్ టార్చర్!" అన్నాడు కృష్ణమూర్తి. అతని గొంతు బొంగురుపోయింది.

స్వర్ణ హృదయం కరిగిపోతోంది. "దీనికి పరిష్కారం ఆలోచించావా బావా?" ప్రశ్నించింది.

"పరిష్కారమా?"

"అవును! ఇలా ఎంతకాలం?"

"ఎంతోకాలం పట్ట దనుకుంటాను. ఎందు కంటే సుగుణ డైవర్స్‌కి నోటీసు పంపింది మొన్ననే!"

"ఏం నిర్ణయించుకున్నావ్?"

"నేనా? నే నేం నిర్ణయించుకుంటాను స్వర్ణా? అసలు నా నిర్ణయాలు, ఆలోచనలు కావలసిం దెవరికి? ఎవరికీ అక్కర్లేదు. అందుకే రాబోయే పరిణామాల కోసం ఎదురు చూస్తున్నాను."

"పిల్లలు అన్యాయమైపోతారు బావా!"

"అవును అనలేను. ఎందుకంటే వాళ్ళు తండ్రిని మరిచిపోయినా కన్నతల్లి దగ్గరుంటారు. ప్రేమించినా, ద్వేషించినా తల్లి తల్లే!"

"అక్క మనసులో ఇప్పుడు పిల్లలంటే ద్వేషం తప్ప ప్రేమ లేదు బావా! తలుచుకుంటేనే భయం పుడుతోంది. అది వాళ్ళని పెట్టే చిత్రహింసలు చూసి భరించలేకపోతున్నాను."

"నిజమే! భరించటం కష్టం. కాని నువ్వు చెయ్యగలిగిం దేం లేదు. నేను ఆపగలిగేదీ లేదు. ఎందు కీ బాధ?"

"చెయ్యగలిగింది లేకేం? ఉంది బావా! అని చెప్పటానికే వచ్చాను. ఈ ఇంట్లో, నీ మనసులో అక్కస్థానం నా కివ్వు బావా! పిల్లల బాధ్యతని ఆనందంగా మోస్తాను. అన్ని విధాలా సహకరిస్తాను. నువ్వు నాకు అర్థం కాక ముందు నిన్ను అసహ్యించుకున్నాను. అర్థమయ్యాక జాలిపడ్డాను. క్రమంగా నువ్వంటే ప్రేమతో కదిలిపోయాను. నా ఉద్దేశాన్ని డాడీకి చెప్పాను. బావతోనే మాట్లా డమ్మా అన్నారు. కొండంత ఆశతో వచ్చాను."

కొంతసేపు మాట్లాడలేకపోయాడు కృష్ణమూర్తి. స్వర్ణ ఆత్రంగా ఎదురు చూస్తోంది అతని జవాబు కోసం.

"సు వ్వొట్టి పిచ్చిదానివి స్వర్ణా? నే నేం జవాబు చెబుతానో మీ డాడీకి తెలుసు. నా ద్వారా నువ్వు వింటే బాగుంటుం దని పంపా రనుకుంటాను. నువ్వు ప్రేమ అనుకుంటున్నది నా మీద కలిగిన జాలికి తొడిగిన అందమైన ముసుగు. ఇంత త్యాగానికి తగిన గొప్పవాణ్ణి కాదు. అహంకారంతో నావల్లా తప్పులు జరిగాయి స్వర్ణా! వాటి కీ శిక్ష న్యాయమే. నా భార్యా పిల్లలు దూరమైపోయినందుకు బాధపడుతున్న మాట నిజమే గాని, శాశ్వతంగా తెగతెంపులు చేసుకుని సుగుణ స్థానం మరో అమాయకురాలి కిచ్చి నా సుఖం నేను చూసుకునేంత నీచుణ్ణి కాదు.

"సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న భార్యా భర్తలు తాత్కాలిక కావేశాలతో, కక్షలతో విడిపోవచ్చు. మళ్ళీ కలుసుకోకూడదని ఎక్కడుంది? మా ఇద్దరి మధ్యా ఉన్నది కేవలం భౌతిక బంధం మాత్రమే కాదు స్వర్ణా! అంతకు మించిన మనో బంధం. అది తెగిపోయేది కాదు. చట్టాలకు అతీతమైన ఒక మహాశక్తి. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే జోక్యం చేసుకునే అవకాశం ఉంది చట్టానికి. అన్ని వేళలా కాదు. బట్టలు మాసిపోతే, చిరిగిపోతే మార్చుకున్నంత తేలిక కాదు, భార్య భర్తని మార్చటం, భర్త భార్యని మార్చటం. ఈ వివాహ వ్యవస్థ అందుకోసం ఏర్పడలేదు. సమస్యలు ఎదురైనప్పుడల్లా పరిష్కారం కోసం కృషి చేయకుండా, నిరీక్షించకుండా భార్యా భర్తల్ని పరస్పరం రీప్లేస్ చేసుకుంటూ పోతుంటే దానికి అం తెక్కడ? మనసుకీ, మమతకీ స్థానం ఎక్కడ? ఆ రెండింటి పునాదీ లేని ఏ వ్యవస్థ అయినా ఎంతకాలం నిలబడుతుంది స్వర్ణా!" అన్నాడు కృష్ణమూర్తి చాలా గంభీరంగా.

స్వర్ణ తన చెవుల్ని తనే నమ్మలేనట్లు కళ్ళప్పగించి చూస్తోంది.

"ఎవరికైనా ఈ వివాహ వ్యవస్థ పట్ల అలాంటి అభిప్రాయం ఉంటే అది పూర్తిగా దురభిప్రాయం స్వర్ణా! అదే వాస్తవం అనుకుంటే భ్రమ!" అన్నాడు కృష్ణమూర్తి మళ్ళీ తనే.

"సుగుణక్క విడాకులు కోరుతోంది బావా!" అన్నది స్వర్ణ.

"కావచ్చు. ఆమె ఇష్టానికి అనుగుణంగా నేను చట్టానికి తల వంచే అవకాశమూ లేకపోలేదు."

"ఆ తరువాత జరిగే దేమిటి?"

"ఈ ప్రశ్నకి కాలమే జవాబు చెబుతుంది స్వర్ణా! నాకు మనసు మీదా, మమతల మీదా నమ్మకం చావలేదు. చావదు కూడా! సుగుణలో మార్పుకోసం, నా మనిషిగా మారటానికి ఎదురు చూస్తూ ఉంటాను. నీ నిర్ణయం మార్చుకో స్వర్ణా! నీ కోసం వెయ్యి కళ్ళతో నిరీక్షిస్తున్న రాజేశ్వర్‌ని గురించి ఆలోచించు. నీ భవిష్యత్తుని సుఖమయం చేసుకునేందుకు మా అనుభవాలు నీకు ఉపయోగపడతా యేమో! అయ్ విష్ యూ ఆల్ ద బెస్ట్! ఫ్లాస్కులో టీ ఉంది తెస్తాను. కూర్చో!" అంటూ కృష్ణమూర్తి లేచి కిచెన్‌లోకి నడిచాడు.

నజల నేత్రాలతో అతను వెళ్ళిన వైపు చూస్తూ ప్రతిమలా ఉండిపోయింది స్వర్ణ. ★

